


# విజయ దుర్గమ్మ సన్నిధిలో మంత్రి మండిపల్లి

**కడప వైద్యవిభాగం, జూన్ 15, ప్రభాతవార్త:**
రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖామంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం కడప విజయ దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సొంత నియోజకవర్గం రాయచోటి వెళ్తూ శనివారం మార్గమధ్యలో కడప విజయ దుర్గ ఆలయాన్ని సందర్శించారు. తొలి సారిగా మంత్రి పదవిని చేపట్టిన ఆయనకు ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కడపకు వచ్చిన మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు.

వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 16 జూన్ 2024

# పుత్తా కృష్ణచైతన్యరెడ్డికి శుభాకాంక్షలు



**కమలాపురం, జూన్ 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఎర్రగుండిపాడు గ్రామంలో ఉన్న ఎస్సీ, బీసీ కాలనీ ప్రజలు శనివారం కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తెదేపా మెజార్టీ వచ్చినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి

# అడుగడుగునా నీరాజనం





**రాయచోటి, రామాపురం, జూన్ 14, ప్రభాతవార్త:**
ఏపీ రాష్ట్ర మంత్రిగా ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర రాష్ట్ర, రవాణా, యువజన మరియు క్రీడా శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం మొదటి సారిగా రాయచోటికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులకు గువ్వల చెరువు ఘాట్ వద్ద నుంచి ప్రజలు విశేష సంఖ్యలో రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి మంత్రికి ఘన స్వాగతం పలికారు. గువ్వల చెరువు నందు క్రేన్ ద్వారా భారీ గజమాలతో ప్రజలు స్వాగతం పలికారు. ఇసుక వేస్తే రాలనంత జనం హాజరై డప్పువాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో గువ్వల చెరువు, కొత్తరోడ్డు, నారాయణపురం, నీలకంఠరావుపేట, రామాపురం, గంగనేరు, కొండవాండ్లపల్లె, చిట్లూరు, బండపల్లె పట్టణంలో భారీ ర్యాలీ ద్వారా మంత్రి పార్టీ కార్యాలయం చేరుకున్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా గువ్వల చెరువు ఘాట్ నుంచి రాయచోటి టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ ద్వారా ప్రజలకు, మంత్రివర్యులకు చేతులు ఊపుతూ ప్రయాణికుల తమ ఆనందం వ్యక్తం చేశారు. గువ్వల చెరువు ఘాట్ నుంచి రాయచోటి రింగ్ రోడ్డు వరకు భారీ సంఖ్యలో ప్రజలు మంత్రిని చూసేందుకు వాహనాలలో తరలి వచ్చారు.





## ల్యాండ్‌టైటలింగ్ యాక్టు రద్దుకు సహకరించిన ఎమ్మెల్యే

వార్త 3వ పేజీలో

## పీలేరులో ప్రయివేటు సీబీఎస్ఈ పాఠశాలు ఉన్నాయా...?

వార్త 3వ పేజీలో

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

– ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కడప డీఎస్పీ షరీఫ్



**కడప క్రైం, జూన్ 15, ప్రభాతవార్త:**
కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అని ఈనెల 17న బక్రీద్ పండగను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణలో సంతోషంగా జరుపుకోవాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. ఏదైనా సమస్య వస్తే నోడల్ అధికారికి లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పండగను సోదర భావంతో జరుపుకోవాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ముస్లిం సోదరులకు కడప డీఎస్పీ షరీఫ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

# రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చింది

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



**మదనపల్లె, జూన్ 15 ప్రభాతవార్త :**
ఐదేళ్ళ వైకాపా రాక్షస పాలన పోయి ప్రజలకు రామరాజ్యం పాలన వచ్చిందని ఎమ్మెల్యే షాజహాన బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు రామ్మూర్తినాయుడు, అమ్మినేనివీధి చిన్నీలు బాణసంచాపేల్చి ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గత ఐదేళ్ళలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారందరికి పార్టీ తరపున అండగా ఉంటానన్నారు. కార్యకర్తలు అందరూ సమైక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార మే ధ్యేయంగా తాను పనిచేస్తానన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో చెప్పిన వాగ్దానాలు అన్నీ నెరవేర్చుతానన్నారు. తొలుత ప్రమాణస్వీకారం రోజే ఐదు వాగ్దానాలకు తొలిసంతకం చేయడం జరిగిందన్నారు. కార్యకర్తలే టిడిపి పార్టీకి పట్టుకొమ్మలాంటివారన్నారు. అనంతరం కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు నాదేండ్ల విద్యాసాగర్, రామ్మూర్తినాయుడు, చిన్నీ, రాష్ట్ర బిసిసెల్ ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, ఆంజినేయులు, పులిమహాలక్ష్మి, రాధా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను వెలికి తీయండి

### మండల శాఖ అధికారులకు సూచించిన తెదేపా జాతీయనేత నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



**పీలేరు, జూన్ 15 ప్రభాతవార్తః**
నియోజకవర్గంలోని కలికిరిలోని నగిరిపల్లెలో శనివారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాల్ని వెలికి తీసి పూర్తి సమాచారం తీసుకురావాలని లేదంటే విజిలెన్సు ఇంక్వైరీ వేపించి ఉన్నతాధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక మండలంలో కాపురం ఉంటూ మరో మండలంలో చెరువు, గుట్ట, కాలువపొరంబోకు ప్రభుత్వానికి సంబంధించిన భూముల్లో ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా ఇళ్లు నిర్మించుకోవడానికి పొజిషన్ సర్టిఫికేట్, నో అబ్జక్షన్ సర్టిఫికేట్‌లు ఎలా ఇస్తారని మండి పడ్డారు. దివంగత ఎన్టీఆర్ రైతులను ఉద్దేశించి పీలేరు పరిసరాల్లో ఆయిల్‌మిల్ కోసం భూములు కేటాయిస్తే జగనన్న కాలనీ పేరుతో దర్జాగా ఇంద్రభవనాలు నిర్మించారన్నారు. పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న నకిలీ పత్రాలు సష్టించి వైసీపీ నాయకులు తమ కుటుంబ సభ్యులు వర్క్ చేస్తున్నట్లు బిల్లులు చేసుకుని లక్షల రూపాయలు దోచుకున్నట్లు ఆరోపించారు. నియోజకవర్గ స్థాయిలో మండలశాఖల వారిగా జరిగిన అక్రమాలపై వైసీపీ నాయకులు వారికి సహకరించిన అదికారులపై చర్యలు తప్పవని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే సర్వే నెంబరుపై డీకేటీ భూములు రిజిస్ట్రేషన్ చేయడం వంటి అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయన్నారు. ప్రభుత్వ పేదల అవసరాలకు ఉన్న భూములు అన్యాక్రాంతం అవుతుంటే చూస్తూ వారికి అన్ని విధాలుగా సహకరించడం సబబు కాదన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఏపీఐఐసీ లేఅవుట్‌లో విశ్వ బ్రాహ్మణులకు అనుమతులు లేకుండా ఆరు నుంచి ఏడు ఎకరాల వరకు కట్టబెట్టడం న్యాయమా అంటూ ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ జాగాల్లో అక్రమ కట్టడాలు మీకు కనిపించడం లేదా అన్నారు. వాటికి అనుమతులు ఎలా పొందారన్నారు. అధికారులు ఉద్యోగ రీత్యా జవాబుదారీతనం మరచిపోవడం వైసీపీ నాయకులకు వత్తాసు పలకడం ఏమిటని పెద్దఎత్తున ప్రశ్నల వర్షం కురిపించారు. ఈసమావేశంలో నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వామ్మో జూన్...!

### ఫీజులు, ఇతర ఖర్చులపై తల్లిదండ్రులకు భారం

### రూ.వేళల్లో ఖర్చుల మోత



**మదనపల్లె, జూన్ 14 ప్రభాతవార్త:**
జూన్ మాసం అంటేనే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఓ రకమైన భయాందోళన కలిగిస్తొంది. ఈనెల మొత్తం ఎలాంటి టెన్షన్ లేకుండా సాఫీగా జరిగిపోవాలని భావిస్తారు. ముఖ్యంగా ప్రైవేటు స్కూల్స్, కళాశాలలో విద్యార్థులను చేర్పించే తల్లి దండ్రులు ఆందోళనకు గురవుతారు. ఏడాదిలో ఈ జూన్ నెలకు మాత్రం ప్రత్యేకత ఉంటుంది. వేసవి సెలవులు కాగానే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభిస్తారు. ప్రారంభం కాగానే విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు గురించి ఆలోచిస్తారు. ప్లేస్కూల్‌నుంచి కళాశాల వరకు ఇప్పుడున్న ఫీజులను తలచుకుంటేనే గుండె జల్లుమంటుంది. కార్పోరేట్ స్కూల్ నుంచి సాధారణ ఇంగ్లీష్‌మీడియం స్కూల్, కళాశాల వరకు ఫీజులు భారీ మొత్తంలో వసూలుచేస్తున్నారు. కార్పోరేట్ స్కూలులో ప్లేస్కూల్‌లో చేర్పించాలన్నా ఏడాదికి రూ.30 వేలనుంచి రూ.లక్ష వరకు అవుతుంది. కార్పోరేట్ కళాశాలలు, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు అయితే లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజులతో పాటు పిల్లలకు అవసరమైన బుక్స్, బట్టలు, స్టేషనరీ, ఇతర ఖర్చులకు మరో రూ.30వేలు వరకు ఖర్చు అవుతుంది. హాస్టల్‌లో చదివే విద్యార్థులకు మరింత అధనం ఖర్చు అవుతుంది. ఇలా ప్రతి విషయంలోనూ విద్యార్థుల అవసరాలకు తగ్గట్టు డబ్బులు వెదజల్లే అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థిని బాగా చదివించాలన్న తల్లిదండ్రుల కోరిక తగ్గట్టు వారు చదివే పాఠశాలలను ఎంపిక చేస్తారు. ప్రైవేటు పాఠశాల్లో చేర్పించే తల్లిదండ్రుల పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించే తల్లిదండ్రులు కూడా వారి స్థాయికి తగ్గట్టు డబ్బులు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా వ్యవసాయం లాభసాటి లేకపోవడంతో రైతులు డబ్బులతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగస్తుల పరిస్థితి కొంత బాగానే ఉన్నా ఎక్కువ మంది భారంగానే భావిస్తారు. ఇక సామాన్యులకైతే చెప్పనవసరం లేదు. ఇలా అన్ని వర్గాల వారికి జూన్ లో ఫీజులు, ఇతర ఖర్చులను భరించాలంటే ఫీవర్ వచ్చే పరిస్థితి. ఎలా ఈ నెల గడుస్తుందోనన్న భయంతో ఉంటున్నారు. ఈనెల 13నుంచి ప్రతి పాఠశాల, కళాశాలలు ప్రారంభం అయ్యాయి. పట్టణాల్లో ఉన్న విద్యాసంస్థలన్నీ ఇప్పుడు నుండే అడ్మీషన్లతో రద్దీగా ఉంటున్నాయి. విద్యార్థులు చేర్పించే పనిలో తల్లిదండ్రులు ఉంటున్నారు. విద్యార్థులను పాఠశాల, కళాశాలలో చేర్పించి వారికి అవసరమైన ఫీజులు చెల్లించేంతవరకు టెన్షన్‌గానే ఉంటుంది.

# జనన,మరణ సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం

### శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చైర్మన్, కమిషనర్ ఆగ్రహం

**బద్వేలు, జూన్ 15 ప్రభాతవార్త :**
మున్సిపాలిటీలో జనన..మరణాల సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం జరుగుతోంది. గత కొన్ని రోజులుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణలతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని సచివాలయం సిబ్బంది అధికారులకు తెలిపినట్లు సమాచారం. దీనిపై మున్సిపల్ చైర్మన్, కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను మందలించినట్లు సమాచారం. జనన మరణాల సర్టిఫికెట్‌లో మాముళ్లు ఇవ్వనిదే సర్టిఫికెట్ జారీ చేయరనే విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందే. మాముళ్లు ఇవ్వకపోతే సర్టిఫికెట్ నెల రోజులైనా రాదు. మాముళ్లు ఇస్తే రెండు రోజుల లోనే జారీచేస్తారు. కొంతమంది డబ్బులు ఇచ్చి కూడా ఆలస్యమవడంతో సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం చేయడం జరిగినట్లు సమాచారం. అంతేకాకుండా మున్సిపల్ చైర్మన్‌కు కూడా జనన మరణాల సర్టిఫికెట్ల విషయమై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సచివాలయంలోని 35 వార్డులకు గాను 4 వార్డులలోనే జనన మరణాల సర్టిఫికెట్లు జారీ చేసేందుకు సిబ్బందికి అనుమతులు ఇచ్చారు. వారి ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమ్మక్కై నచ్చిన వారికి ఇచ్చిన వారికి త్వరగా సర్టిఫికెట్ జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఈ మధ్య కాలంలో శానిటరీ ఇన్‌సె ్పక్టర్‌పై వచ్చిన కొన్ని ఆరోపణలతో ఏ సర్టిఫికెట్‌పై సంతకం చేయకపోవడం ఒకటికి పది సార్లు సచివాలయం సిబ్బంది సమాచారం ఇచ్చినా అందుబాటులో ఉండకపోవడం వలన జనన మరణాల సర్టిఫికెట్లు ఆలస్యమవుతున్నట్లు మున్సిపాలిటీ నుంచి సమాచారం. ఎక్కడ ఆలస్యం జరుగుతుందని విచారణ చేస్తే శానిటరి ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష ్యంగా వ్యహరిస్తున్నారని అందుకే ఆలస్యమవుతుందని తెలుసుకున్న చైర్మన్ కమిషనర్ ఇరువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా జనన మరణ సర్టిఫికెట్లు తొందరగా జారీ చేయాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.జనన మరణాల సర్టిఫికెట్లు సచివాలయం ద్వారా మున్సిపాలిటీకి వస్తూనే ఒకటికి రెండు రోజులలో జారీ చేయాల్సి ఉండగా మున్సిపాలిటి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోజుల తరబడి మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు అంటున్నారు. తప్పుఒప్పులుంటే వెంటనే పరిశీలించి సరిచేసి జారీ చేయాలి తప్ప సర్టిఫికెట్లకోసం వచ్చేవారిని తిప్పుకోవడం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కానీ ఆ అధికారి మాత్రం తాను చెప్పిందే వేదమని ముందుకు సాగుతున్నారు.

# బక్రీదు ఏర్పాట్లపై పరిశీలన



**పులివెందుల రూరల్, జూన్ 15, ప్రభాతవార్త ః**
పులివెందులలో సోమవారం జరగనున్న ముస్లింల పవిత్ర పండుగ బక్రీదు పండుగ కోసం ఈద్గాలలో చేపట్టాల్సిన సౌకర్యాల గురించి మున్సిపల్ అధికారులతో మైనార్టీ నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జోగిరెడ్డి, మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, ఇతర సభ్యులతో కలిసి పులివెందులలోని శ్రీరామహాల్, కోతిసమాధి వద్ద ఉన్న ఈద్గాలను శనివారం పరిశీలించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వాహనాల పార్కింగ్, షామియానాలు, తాగునీరు, సౌండ్ సిస్టమ్, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లగారి భాస్కర్‌రెడ్డి, ఖాసింవలి, గుడుసా బాబాఫకృద్దీన్, జాఫర్, విజయ భాస్కర్, తూగుట్ల రాఘవరెడ్డి, ఇంటేపల్లె విశ్వనాథరెడ్డి, షేక్ సమద్, నాగిన్, యూసుఫ్ పాల్గొన్నారు.

## హెచ్‌పి గ్యాస్ కంపెనీ వింత పోకడలు

**పులివెందుల రూరల్, జూన్ 15, ప్రభాతవార్త ః**
పులివెందులలోని బైపాస్‌రోడ్డులో ఉన్న హరి హెచ్‌పి గ్యాస్ కంపెనీ ఆధార్ అనుసంధానం ఆన్‌లైన్ ప్రక్రియ చేయాలంటే ఏదో ఒక వస్తువు కొనాలంటూ ఖాతాదారులను డిమాండ్ చేస్తూ వింత పోకడలు ప్రదర్శిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ, ఇతర విషయాలకు సంబంధించి ఎల్పీజీ కనెక్షన్‌ను ఆధార్‌కార్డుతో లింకు చేసుకోవాల్సిన పరిస్థితుల్లో సేవలందించాల్సిన గ్యాస్ కంపెనీ ఈ సేవలను అందించేందుకు ఏదో ఒక వస్తువును కొనాలంటూ వినియోగదారులపై ఒత్తిడి తెస్తున్నారు. గతంలో కూడా ఈ గ్యాస్ ఏజన్సీ వారు మరో గ్యాస్ కంపెనీకి ఖాతాలను మళ్లించేందుకు అనేక ఇబ్బందులు సృష్టించారని, డెలివరీ ఛార్జెస్ వసూలు చేయడం, సిలిండర్లు వినియోగదారులకు చేరకపోయినా చేరినట్లు సమాచారం రావడం పట్ల వినియోగదారులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగదారులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.




## రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి



**వేంపల్లె, జూన్ 15, ప్రభాతవార్త ః**
రాయలసీమలో హైకోర్టు కానీ, హైకోర్టు బెంచ్ కానీ ఏర్పాటు చేయాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టు రెండింటిలో ఏదో ఒక దానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందం ప్రకారం 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు రాజధాని రాయలసీమ, హైకోర్టు కోస్తాలో ఏర్పాటు చేశారన్నారు. 1956లో తెలంగాణతో కలిసి ఉమ్మడి ఏపీ ఏర్పడినప్పుడు రాజధాని, హైకోర్టు రెండూ కూడా హైదరాబాదుకు తరలించబడ్డాయన్నారు. 2014లో రాష్ట్ర విభజన కారణంగా నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటైన నేపథ్యంలో రాజధాని, హైకోర్టులలో ఏదో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాలి, కానీ అలా జరగలేదన్నారు. ఇది చారిత్రక తప్పిదమన్నారు.

## ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

**పులివెందుల, జూన్ 15, ప్రభాతవార్త ః**
ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. పులివెందులలోని తెదేపా కార్యాలయంలో శనివారం ఆయనను పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమూల మార్పులు చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులను సమాయత్తం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




### చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో

## కొనసాగుతున్న అన్నదానం




**ప్రొద్దుటూరు, జూన్ 15, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, శ్రీ కృష్ణాలయ యాదవ సేవాసమితి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున ప్రొద్దుటూరు పట్టణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ సమీపంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రతి శనివారంలాగే ప్రజల ఆదరణతో సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. ప్రొద్దుటూరు చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు, నిరాశ్రయులు, పాదాచారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వారు వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చూసేలా అమ్మవారు చల్లా రాజగోపాల్ యాదవ్‌ను ఆశీర్వదించి శక్తి సామర్థ్యాలను అందజేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, నల్లం రవిశంకర్, జయచంద్ర, సీతంపల్లి రమణ, ప్రసాద్, శివ, యేసు నాథరెడ్డి, నాయిబ్రాహ్మణ సంఘం శ్రీనివాసులు, రామచంద్రరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేకోడూరు అభివృద్ధి మా ప్రథమ కర్తవ్యం



**రైల్వేకోడూరు, జూన్ 15, ప్రభాతవార్త:**
ఇంచార్జీ కింగ్ మేకర్ ముక్కా రూపానందరెడ్డి, రైల్వేకోడూరు నియోజకవరాగన్ని రానున్న అనతి కాలం లోనే అంచెలంచలుగా అభివృద్ధి చేస్తామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చేంతవరకు విశ్రమించనని కింగ్ మేకర్ ముక్క రూపానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తిరుగు లేని మెజీర్టాతో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించారని, అదేవిధంగా అధికార పార్టీని అభివృద్ధి చేయని పక్షంలో పూర్తిస్థాయిలో ఓడించారని ఆయన అన్నారు. ముఖ్యంగా తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ప్రజామన్నలను పొందతామని ఆయన పూర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ప్రతి పంచాయతీని లోటు పాట్లుగా ఉన్న సమస్యల పట్ల స్పందించి ప్రజల కోరికలను నెరవేరుస్తామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రైల్వేకోడూరులో పూర్వ వైభవాన్ని తెచ్చి ప్రజలకు అంకితభావంతో అప్ప చెబుతామని అన్నారు. అదేవిధంగా అనతి కాలంలోనే తెలుగుదేశం పార్టీ బాధ్యతలు చేపట్టి బిజెపి, జనసేన, తెలుగుదేశంలు కలిసి ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టి విజయ పదాన గెలిపించారని, పెండింగ్లో ఉన్న నియోజకవర్గ పనులను అనూహ్య రీతిలో పూర్తి చేస్తామని అన్నారు. ఇప్పటికే తమ కుటుంబంపై నియోజకవర్గ ఐదు మండలాల ప్రజలు చెరగని ముద్రవేశారని ఆ నమ్మకాన్ని ఎప్పటికీ ఒమ్ము చేయబోమని కింగ్ మేకర్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకొనబడిన రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మరియు ఇంచార్జ్ రూపానందరెడ్డిని టిడిపి కార్యకర్తలు జనసేన కార్యకర్తలు గజమాలతో ఘనంగా సత్కరించారు.

# యువతకు స్ఫూర్తిని నింపిన శ్రీశ్రీ రచనలు



**బద్వేలు అర్బన్, జూన్ 15 ( ప్రభాతవార్త):**
తన రచనలతో సమాజ మార్పుకు శ్రీకారంచుట్టిన గొప్ప వ్యక్తి శ్రీశ్రీ అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని తెలిపారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సుందరయ్య భవనం పట్టణ కమిటి ఆధ్వర్యంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు సమాజానికి ఉత్తేజభరితంగా అనునిత్యంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా యువతను కదిలించే విధంగా ఆయన కవిత్వాలు ఉంటాయన్నారు. అందుకే ఆయనను విప్లవ కవి అని కూడా అంటుంటారు. ఆయన రచనలలో మహా ప్రసాథనం మైలురాయి అని, నేడు ఆయన రచనను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అటు కేంద్రంలో బీజేపీ ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలు అమలు పరచడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. కడప ఉక్కుపరిశ్రమ వెనుకబడిన రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ వంటివి సాధనకోసం కృషి చేయాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, నాగార్జున, ప్రవీణ్‌కుమార్, యువరాజ్, మంద నరసింహ పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారికి పుష్పయాగం





**బద్వేలు అర్బన్ , జూన్ 15 (ప్రభాతవార్త) :**
పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం దశమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఆలయ పూజారి రమేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారుజామునుంచే స్వామి వారికి వివిధ రకాలతో పుష్పయాగం, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం సాయంకాలం స్వామివారికి చక్రస్నానం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఈవో శివయ్యలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక హోమాలలో పలువ ురు భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాంబయ్య, కొండయ్య భక్తులు పాల్గొన్నారు.

## డాక్టర్ సుధకు అభినందనలు తెలిపిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు

**పోరుమామిళ్ల, జూన్ 15 ( ప్రభాతవార్త):**
బద్వేలు ఎమ్మెల్యేగా రెండవసారి ఎన్నికైన డాక్టర్ సుధను వివిధ మండలాల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఇతర నాయకులు, వివిద మండలాల అధికారులు శుభాకాంక్షలు తె లిపారు. ఈ సంధ్బంగా ఎమె ్మల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండాలని నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అందుబా టులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.



## ఆధునిక సాహిత్య మార్గదర్శి శ్రీశ్రీ

**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 15, ప్రభాతవార్త:**
సాంప్రదాయ చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి అభ్యుదయ మార్గంలో కవిత్వం రాసిన ఆధునిక సాహిత్య మార్గదర్శి శ్రీశ్రీ అని కడప జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం పేర్కొన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతి సంధర్భంగా ఆయనకు నివాళి ఘటిస్తూ, శ్రీశ్రీ మహాప్రస్థాణం రచనలతో నూతన ఒరవడిని సృష్టించాలని ఆ కవిత్వం ఎందరికో స్ఫూర్తిదాయకమైందని తెలిపారు. తిక్కన, వేమన, గరజాడలను ప్రజాకవిగా పేర్కొన్న శ్రీశ్రీ ఆధునిక యువకర్తగా నిలిచిపోయారని ఆయన అన్నారు. సినీపరిశ్రమలో ఎన్నో ఆణిముత్యాలు లాంటి పాలను అందించి తెలుగు సినిమా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకుపోయారని కొని ఆడారు. ఆధునిక కవిత్వ దశ, దిశను మార్చిన శ్రీశ్రీ నేటి కవులకు ప్రాతస్మరణీయుడని వర్ధంతి సంధర్భంగా అంజలి ఘటించారు.

## విధ్యార్ధులకు విద్యా సామాగ్రి పంపిణి

**దువ్వూరు, జూన్ 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గొల్లపల్లె ప్రాధమిక పాఠశాల నందు చదువుతున్న విధ్యార్ధిని విధ్యార్ధులకు శనివారం సేవా సమితి ఆధ్వర్యంలో విధ్యార్ధులకు అవసరమైన విద్యాసామాగ్రిని ఎంఈఓ సగిలి భాస్కర్ పంపిణి చేశారు. ఈ సంధర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆత్మ బంధు సేవా సమితి ఆధ్వర్యంలో విధ్యార్ధులకు అవసరమైన పరికరాలు అందజేయడం సంతోషదాయకం అన్నారు. మారుమూల గ్రామాల్లోని పేద విధ్యార్ధులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, విధ్యార్ధుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అమ్మవారికి విశేష పూజలు



**బద్వేలు అర్బన్, జూన్ 15 ( ప్రభాతవార్త):**
పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో శనివారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో వాసవిమాత అమ ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీ ఉపాధ్యక్షులు గంగిశెట్టి ధనలక్ష్మిల ఆధ్వర్యంలో వాసవిమాత అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఉభయ దాతలుగా మంచికంటి సురేష్ సురభి, వల్లంకొండు వెంకటరమణ, సతీమణి ధనలక్ష్మి, పత్తి నరసింహారావు సతీమణి వరలక్ష్మి, జొన్నలగడ్డ సుధాకర్, సతీమణి రాధ, నారాయణ వెంకటసుబ్బయ్య సతీమణి మంజులదేవి, వంకదారి విజయ్‌కుమార్‌సతీమణి రాజేశ్వరి, బైసాని రంగారావు సతీమణి విజయకుమారి, సురేష్ సతీమణి పద్మావతి కుటుంబ సభ్యుల సహకారంతో వాసవిమాత అమ్మవారికి ఒడిబియ్యం కార ్యక్రమం నిర్వహిం చారు. అనంతరం పలువురు భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అం దించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ పబ్బ తి చంద్రశేఖర్, సత్యనారాయణ, చక్రపాణి, పబ్బతి త్రివేణి, వరల క్ష్మి, శ్రీదేవి, కార్తిక్, ఒలేటి పద్మలత, దేవతి లక్ష్మిదేవి, కొప్పరపు ల త, కొండపల్లి లక్ష్మికాంతమ్మ, సుగుణ, తులసి లక్ష్మిదేవి , సముద్రా ల సత్యావతి, దర్శి నాగలక్ష్మి, మెంటా లక్ష్మినారాయణమ్మ, వాసవి మాతను దర్శించుకుని అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించుకు న్నారు.



# కొక్కొరొకో...ధరలు అధికం

- చికెన్ కొనలేం..తినలేం-కొండెక్కిన చికెన్ ధరలు
- బాయిలర్ కిలో రూ.240 - నాటుకోడి రూ.400
- ఆందోళనలో సామాన్య ప్రజలు




**మదనపల్లె, జూన్ 15 ప్రభాతవార్త :**
ధరలు ఆకాశానంటుతున్నాయి. సామాన్యులకు చికన్ అందుబాటులో లేకుండా పోతోంది. కొనలేం తినలేమంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాయిలర్ చికన్ కిలో రూ.240లు ధర ఉండగా, నాటుకోడి చికన్ రూ.400లు ధర పలుకుతోంది. సాధారణంగా వేసవిలో చికన్ ధరలు తగ్గుముకం పడు తాయి. అలాంటిది ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులకు చికన్ బంగారులా ఉంటోంది. చికన్‌లో కూడా నాలుగు రకాల మాంసం ఉండడంతో చికన్ సెంటర్లలో వివిధ రకాల ధరల పట్టికను ఏర్పాటు చేశారు. స్కిన్‌లెస్ చికన్, బాయిలర్, బోన్‌లెస్, గిరిరాజా లాంటి చికన్‌లు ఉన్నాయి. వీటితో పాటు నాలుకోడి చికన్ కూడా డిమాండ్ ఉండడంతో ధరలు రోజు రోజుకు పెరుగు తున్నాయి. కోళ్ళ ఉత్పత్తి తక్కువుగా ఉండడం వల్లే ధరలు పెరిగాయంటూ వ్యాపారులు చెబుతున్నారు. వేసవిలో కోళ్ళ పరిశ్రమలో ఎండల తాకిడికి కోళ్ళు తూకం తగ్గడం, ఉత్పత్తి ఘననీయంగా పడిపోవడం వల్లే ధరలు ఆకాశానంటు తున్నాయి. సాదారణంగా మాంసాహారాలు చికెన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక పొట్టేళ్ళు, మేకపోతుల మాంసం కూడా అధిక ధరలకే విక్రయిస్తున్నారు. కిలో మాంసం రూ.700నుంచి 750ల వరకు విక్రయిస్తున్నారు. ఆదివారం రోజు మాంసం క్రయవిక్రయాలు పట్టణాల్లో జోరుగా జరుగుతాయి. జూన్ నెల అంతా జాతర్ల నెల కావడంతో మాంసానికి ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. ధరల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలంటూ పలువురు కోరుతున్నారు. కోడిగుడ్డుల ధరలు కూడా అధికంగానే ఉంటున్నాయి. కోడిగుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. చేపలు ధరలు కూడా ఎక్కువుగానే ఉంటున్నాయి. మదనపల్లె డివిజన్ పరిసర ప్రాంతాల్లో చాపలు పెంపకం తక్కువుగా ఉండడం వల్ల ధరలు పెరిగాయంటూ వ్యాపారస్తులు చెబుతున్నారు. నెల్లూరు, చెన్నైలకు చెందిన సముద్రపు చాపలు ఇక్కడికి తీసుకొచ్చి వ్యాపారస్తులు విక్రయిస్తుంటారు. కొరమీన కిలో రూ.800నుంచి 1000ల వరకు విక్రయిస్తారు. వీటిని కొనుగోలు చేసేందుకు కూడా సామాన్యులు బెంబెలు చెందుతున్నారు. ఇక రొయ్యలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో లేకుండాపోతున్నాయి. పట్టణంలో మాంసపు విక్రయదారులకు మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. మాంసపు ధరలు ఎక్కువుగా ఉండడం వల్ల ప్రజలు కూరగాయలు, ఆకుకూరలపై దృష్టి మళ్ళిస్తున్నారు.



# బంగారు ధర పలుకుతున్న టమోటా

## మదనపల్లెలో కిలో రూ.66



**మదనపల్లె, జూన్ 15 ప్రభాతవార్త :**
టమోటా ధరలు బంగారు ధర పలుకుతున్నాయి. శనివారం మదనపల్లె మార్కెట్‌యార్డులో కిలో మొదటి రకం టమోటా కిలో రూ.66లు ధర పలికింది. గత 14 రోజులుగా టమోటాకు ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. మార్కెట్‌యార్డుకు 649మెట్రిక్ టన్నులు టమోటాలు వచ్చాయి. మొదటిరకం పదికేజీల టమోటాబాక్స్ రూ.640నుంచి 660ల వరకు ధరలు పలికాయి. రెండవ రకం రూ.520నుంచి 560ల వరకు ధరలు పలికాయి. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఉండడం వల్లే ధరలు పెరిగాయలని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా ఉత్పత్తి కూడా తక్కువుగా ఉండడం వల్లే ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టాలు చవిచూసిన రైతాంగానికి ధరలు పెరగడంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. ఇవే ధరలు నెల రోజులు పాటు ఉంటే రైతులు అప్పుల బాద నుంచి గట్టు ఎక్కగలరని చెబుతున్నారు. రాష్ట్రంలోనే మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డు వ్యాపార లావాదేవీలకు పేరు పొందింది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు. టమోటా వ్యాపార లావాదేవీలతో మార్కెట్‌లో వేలాదిమంది కూలీలు జీవనం పొందుతున్నారు.

# బోయకొండ ఛైర్మెన్ పదవి బోయలకు కేటాయించాలి

## విఆర్‌ఎస్ఎస్ వ్యవస్థాపకులు నరసింహులు




**మదనపల్లె, జూన్ 15 ప్రభాతవార్త :**
ఉమ్మడి చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న బోయకొండ ఆలయ ఛైర్మెన్ పదవి బోయలకు కేటాయించాలని విఆర్ ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బోయల నామకరణంతో పిలవబడుతున్న ప్రఖ్యాత బోయకొండ అమ్మవారి ఆలయ కమిటీ నిర్వహణ బాధ్యతలు ఇంతవరకు బోయల సామాజిక వర్గానికి ఇవ్వలేదన్నారు. మూడు రాష్ట్రాల నుంచి ఈ ఆలయానికి భక్తులు వస్తూ ఉంటారని ఇక్కడ తొలిపూజ బోయలే చేయడం ఆనవాయితీగా వస్తొందన్నారు. మహాచరిత్ర కలిగిన బోయకొండ ఆలయ ఛైర్మెన్ పదవి బోయలకు కేటాయించి అమ్మవారికి సేవచేసే భాగ్యం కల్పించాలన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**కురబలకోట, జూన్ 15 ప్రభాతవార్త :**
ఇంజనీరింగ్ విద్యార్థులు స్కిల్స్ డెవలప్‌మెంటుపై అవగాహన పెంచుకోవాలని ముఖ్య అతిథి ప్రవీన్‌కుమార్ అన్నారు. శనివారం మిట్స్ ఇంజనీరింగ్‌కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్స్ డెవలప్ మెంటుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రతి విద్యార్థికి టెక్నాలజీపై నైపుణ్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా తగిన శిక్షణ పొందాలన్నారు. ఐటి కంపెనీల నియామకాలపై స్కిల్స్‌కు ప్రాధాన్యత కల్పిస్తున్నాయని తెలిపారు. మినిష్టిరి ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ఐటి, నాస్కాం సంయుక్తంగా ఫ్యూచర్స్‌స్కిల్స్ విత్‌ప్రైమ్ అనే కార్యక్రమంతో విద్యార్థుల్లో నైపుణ్యాలను దేశవ్యాప్తంగా పెంపొందించుకునేందుకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తొందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్, విభాగాదిపతులు పాల్గొన్నారు.

# నారాలోకేష్‌ను అభినందించిన మిట్స్ కరస్పాండెంట్



**కురబలకోట, జూన్ 15 ప్రభాతవార్త :**
రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి, ఎలాక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ మంత్రి నారాలోకేష్‌ను మిట్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వి.విజయభాస్కర్‌చౌదరి అభినందించారు. ఉండవల్లిలోని నారా లోకేష్ నివాసంలో కలసిన సందర్భంగా అభినందనలు తెలియ చేశారు. ఈ సందర్భంగా ఐటి రంగంలో రాష్ట్రాభివృద్ధికి సహకరించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభించేలా కృషి చేయాలని ఆయనను కోరారు.

# బీసీజి టీకాలు అందరికి వేయాలి

## టిబి మెడికల్ అధికారి డాక్టర్ శ్రీధర్



**మదనపల్లెక్రైం, జూన్ 15 ప్రభాతవార్త :**
బీసీజి టీకాలు అందరికి వేయించాలని డివిజనల్ టీబి మెడికల్ అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. శనివారం బి.కొత్తకోట ఆరోగ్య కేంద్రం, పిటిఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు సంబంధించిన ఆరోగ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో 2025నాటికి టీబి నివారణే లక్ష్యంగా బీసీజి టీకాలను వేస్తొందని తెలిపారు. ఈ టీకాతో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చునని తెలిపారు. టీకా ఎంతో సురక్షితమని, బీసిజి టీకా మీద ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి టీకాలను వేయించాలని సూచించారు. ఈ టీకాలను 60ఏళ్ళు పైబడిన వారికి అన్ని సచివాలయాలోన్నల సోమవారం, గురువారం మూడునెలల పాటు ఆరోగ్య సిబ్బంది టీకాలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి డాక్టర్ కిరణ్, పిటిఎం ఆరోగ్య కేంద్రం, డాక్టర్ ఎస్తాని, సబ్‌యూనిట్ అధికారి ఖలీల్; సూపర్‌వైజర్లు విజయకుమారి, రెడ్డెప్ప, మదనపల్లె టిబి విభాగం సిబ్బంది ప్రభాకర్, శాంతి, సుశీల, వనజకుమారి, సునీత, ల్యాబ్ టెక్నీషియన్ రియాజ్, ఆరోగ్య కార్యకర్తలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

# కురబలకోటలో చోరీ



**కురబలకోట, జూన్ 15 ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన కురబలకోటలోని వైశ్య బజారులో శుక్రవారం రాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. వైశ్యాబజారుకు చెందిన సాదం శ్రీనివాసులు పనినిమిత్తం మదనపల్లెలో ఉన్న బంధువుల ఇండ్లకు రెండు రోజుల క్రితం విచ్చేశాడు. తిరిగి శనివారం స్వగ్రామమైన కురబలకోటలోని ఇంటికి వెళ్ళారు. ఇంటి తలుపులు గడియలు పగలుకొట్టి గుర్తుతెలియని దుండగులు ఇంటిలోకి ప్రవేశించి బీరువా తాళాలు పగలుకొట్టి అందులోని విలువైన నగలను చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మదనపల్లె రూరల్ సిఐ, ముదివేడు ఎస్ఐ మల్లికార్జునలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మదనపల్లె క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించి పరిసరాలను పరిశీలించింది. చోరీ అయిన నగలు, నగదు విలువ తెలియరావాల్సి ఉంది. ముదివేడు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

## అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి



**పీలేరు, జూన్ 15 ప్రభాతవార్తః**
పట్టణంలోని ముస్లీం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావ రణంలో జరుపుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ముస్లీం జమాత్, కమిటీ మతపెద్దల తో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను పట్టణ ప్రజలు సోమవారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరారు. ముస్లీం సోదరులు పట్టణంలోని ఈద్గా వద్ద ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని అందరూ సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

# ల్యాండ్‌టైటలింగ్ యాక్టు రద్దుకు సహకరించిన ఎమ్మెల్యే

## సన్మానించిన న్యాయవాదులు

**మదనపల్లెక్రైం, జూన్ 15 ప్రభాతవార్త :**
ల్యాండ్‌టైటలింగ్ యాక్టు రద్దుకు సహకరించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను మదనపల్లె బార్ అసోషియేషన్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం మదనపల్లె బార్ అసోషియేషన్ అహ్వానం మేరకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోర్టు వద్దకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందికరమైన లాండ్‌టైటలింగ్ యాక్టును గత ప్రభుత్వం తీసుకొచ్చిన సమయంలో తెలుగుదేశం పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. మదనపల్లెలో న్యాయవాదులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో కూడా తాను పాల్గొని సంఘీభావం తెలపటం జరిగిందన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టు వల్ల జరిగే నష్టాలను తమ అధినేతకు తెలయజేయటం జరిగిందన్నారు. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన క్షణంలోనే యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేయటం జరిగిందన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ యాక్టుకు సహకరించిన ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు. అలాగే ఎన్నికల మానిఫేస్టోలో ప్రకటించిన విధంగా మదనపల్లె జిల్లాకు సహకరించాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నాదేండ్ల



విద్యాసాగర్, బార్ అసోషియేషన్ అధ్యక్షులు వెంకట్రమణారెడ్డి, ఉపాధ్యక్షులు కాలం రఘపతి, ప్రధాన కార్యదర్శి బయ్యారెడ్డి, ఉపకార్యదర్శి సురేష్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# జూన్ నెల రేషన్ సరుకులు పొందుటకు అవకాశం

**పీలేరు, జూన్ 15 ప్రభాతవార్తః**
రేషన్‌షాపుల ద్వారా నిత్యావసరుకులను పొందు కార్డుదారులు జూన్ నెల సరుకులు ఎవరైనా ఇప్పటి వరకు తీసుకోని యడల పీలేరు పట్టణంలోని నెహ్రూ బజారు 11వ రేషన్‌షాపు ద్వారా సరుకులు పంపిణీ చేయబడునన్నారు. ఈఅవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూబజారు 11వ రేషన్‌షాపు డీలర్ పసుపులేటి వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు.

# క్యాన్సర్ పై అవగాహన శిక్షణ కార్యక్రమం

**పీలేరు, జూన్ 15 ప్రభాతవార్తః**
స్థానిక ఏరియా ఆసుపత్రి నందు నిర్వహిస్తున్న క్యాన్సర్‌పై అవగాహన శిక్షణ తరగతులను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య , ఏరియా ఆసుపత్రి సూపరింటెండెం ట్ డాక్టర్ చంద్రశేఖర్ లతో కలిసి పర్యవేక్షించి శిక్షణ ఇస్తున్న అధికారు లకు, శిక్షణ తీసుకుంటున్న డాక్టర్సు కు సీహెచ్‌ఓలకు ఈకార్యక్రమంపై క్రమశిక్షణతో శిక్షణ పొంది మంచి అవగాహనతో ప్రజల్లోకి తీసుకెళ్లి భవిష్యత్తులో కార్యక్రమం విజయవంతం చేయవలసిందిగా ఆదేశించారు. క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించిన చో సులభంగా సంపూర్ణంగా నయం చేయవచ్చునని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో పీలేరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కమలాపురం, జూన్ 15, ప్రభాతవార్త:**
కమలాపురం మండల పరిధిలోని చదిపిరాళ్ల వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిపై ద్విచక్ర వాహనదారుడు తప్పించబోయి బోల్తా పడి మృతి చెందాడు. మృతుడు ముద్దనూరు మండలం కొలవలి గ్రామానికి చెందిన చింతకుంట ప్రసాద్ (43)గా గుర్తించారు. మృతుడు కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో పీహెచ్ వర్కర్. కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

# కలబందతో జుట్టు ఒత్తుగా పెరగడం ఖాయం



వాలు జడ.. ఇప్పుడు ప్రతి ఆడపిల్లకు ఒక కలగా మిగిలిపోతోంది. పోషకాహార లోపం, వాయు కాలుష్యం, హార్మోన్ల లోపం.. ఇలా రకరకాల కారణాలతో ఒత్తైన, వాలుజడ కలగానే ఉంటోంది. మన పెద్దల కాలంలో జుట్టుకు కొబ్బరినూనె, తలస్నానానికి కుంకుడుకాయ వాడేవారు. అప్పట్లో ఇన్నిరకాల హెయిర్ ఆయిల్స్, రసాయనాలతో కూడిన షాంపూలు లేవు. అంతా నేచురల్ గానే ఉండేవి కాబట్టి వాళ్లకు పొడవాటి ఒత్తైన జడలుండేవి. కానీ ఇప్పుడు నేచురాలిటీ కంటే.. సువాసన వచ్చే ఆయిల్స్, షాంపూల వైపే మొగ్గుచూపుతున్నారు. స్కాల్ప్ పై చుండ్రు లేదా తెల్లటి పొర లాంటిది పేరుకుపోయి.. జుట్టు పెరగడం ఆగిపోవడమే కాకుండా.. ఉన్నది కూడా ఊడిపోతుంది. అయితే.. ఇంట్లోనే ఒక చక్కని చిట్కా.. అదికూడా మనకు అందుబాటులో ఉండే కలబందతో పాటిస్తే.. జుట్టు సంబంధిత సమస్యలు తగ్గి.. వెంట్రుకలు పెరుగుతాయి. ఆ చిట్కా ఏంటో తెలుసుకుందాం.

-ముందుగా రెండు టీ స్పూన్ల బియ్యాన్ని కడిగి నానబెట్టుకోవాలి. ఒక గ్లాసు నీటిలో టీ పొడి వేసి డికాషన్ లా కాచుకుని వడగట్టుకుని పక్కన పెట్టుకోవాలి.

-ఇప్పుడు ఒక మిక్సీ జార్ లో ఒక కప్పు కలబంద గుజ్జు, 4 మందార పువ్వులు వేసి మెత్తగా మిక్సీ పట్టుకుని గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో బియ్యాన్ని నానబెట్టి ఉంచిన నీటిలో నాలుగు టీ స్పూన్లు తీసుకోవాలి. అలాగే 4 టీ స్పూన్ల టీ డికాషన్, అర టీ స్పూన్ ఆముదం వేసి బాగా కలపాలి.

-ఇలా కలుపుకున్న మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివరి వరకూ పట్టించి.. గంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కుంకుడు కాయలు లేదా.. రసాయనాలు తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి.

-ఇలా వారానికి రెండుసార్లు ఈ హెయిర్ ప్యాక్ వాడితే.. చుండ్రు తగ్గి, జుట్టురాలడం కూడా ఆగుతుంది. కొత్తజుట్టు పెరగడంతో పాటు.. తెల్లని జుట్టు కూడా నల్లబడుతుంది.

# నేటికీ పాక్‌ను వణికిస్తున్న హిందూ వ్యాపారి ప్యాలెస్



ప్రపంచంలో దెయ్యాలు, భూతాల కథలతో ముడిపడిన అనేక ప్రాంతాలు కనిపిస్తాయి. పాకిస్తాన్ ఆర్థిక రాజధాని కరాచీ పట్టణంలోనూ అటువంటి మహల్ ఒకటి ఉంది. సూర్యాస్తమయం అయ్యాక ఈ మహల్ సమీపంలోకి రావాలంటే ఎవరైనా భయంతో వణికిపోతారు. అటువంటి సాహసం కూడా ఎవరూ చేయరు. పాకిస్తాన్‌కు చెందిన లోకల్ డిజిటల్ పబ్లికేషన్ బ్రాండ్ సినారియోలో ప్రచురితమైన వివరాల ప్రకారం ప్యాలెస్ పరిసరాల్లో రాత్రివేళ విచిత్రమైన శబ్దాలు వస్తుంటాయి. భవనంలో పెద్ద ఎత్తున పార్టీలు జరుగున్నట్లు రాత్రి వేళ ఏవో శబ్దాలు వస్తుంటాయని చెబుతారు. 1927లో రాజస్థాన్‌కు చెందిన ఒక హిందూ వ్యాపారి నిర్మించిన ఈ ప్యాలెస్‌ను పాకిస్తాన్ సర్కారు మ్యూజియంగా మార్చివేసింది. అయినప్పటికీ నేటికీ రాత్రి వేళ ఇక్కడకు వెళ్లే సాహసం ఎవరూ చేయరు. ఈ ప్యాలెస్ నిర్మాణ విషయానికి వస్తే చరిత్రలో పేర్కొన్న వివరాల ప్రకారం 1927లో రాజస్థాన్‌కు చెందిన శివరతన్ చంద్రరతన్ అనే మార్వాడీ వ్యాపారి తన భార్యపై తనకున్న ప్రేమకు గుర్తుగా ఈ ప్యాలెస్ నిర్మింపజేశారు. శివరతన్ చంద్రరతన్ దంపతుల ప్రేమ కథ అటు పాక్‌లోనూ, ఇటు భారత్‌లోనూ వినిపిస్తుంటుంది. శివరతన్ చంద్రరతన్ మొహట్టా భార్య తీవ్రమైన వ్యాధి బారిన పడింది. ఈ సమయంలో వైద్యులు అతనికి ఒక సలహా ఇచ్చారు. సముద్రపు వేగవంతమైన గాలి తగిలే ప్రాంతంలో ఆమెను ఉంచితే, ఆమె ఆరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు ఆ వ్యాపారికి సూచించారు. వారి సలహా వినగానే ఆ వ్యాపారి రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి ప్రముఖ కళాకారులను పిలిపించి, ఈ ప్యాలెస్‌ను నిర్మింపజేశారు. ఆ సమయంలో ఈ ప్యాలెస్‌లో లెక్కకుమించిన సంఖ్యలో విందువినోద కార్యక్రమాలు జరిగేవని చెబుతుంటారు. అత్యంత ఆదరణ పొందిన ఈ మొహట్టా మహల్ కింది భాగంలో ఒక సొరంగం ఉంది. ఇది కరాచీలోని ఒక ప్రముఖ హిందూ దేవాలయానికి దారితీస్తుందని చెబుతారు. శివరతన్ చంద్రరతన్ మొహట్టా అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య ఎటువంటి ఇబ్బంది పడకుండా ఆలయానికి చేరుకునేందుకే ఈ సొరంగం నిర్మించారట. ఈ మార్గం గుండానే శివరతన్ చంద్రరతన్ భార్య ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తుండేవారట. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బ్రిటీష్ పాలనా కాలంలో ఈ ప్యాలెస్ పలు అక్రమ కార్యకలాపాలకు నిలయంగా ఉండేదని, అందుకే దీనికి భూతాల నిలయం అనే పేరు వచ్చిందంటారు.

# కేఎస్‌ఆర్‌ఎంలో ముందస్తు బక్రీద్ వేడుకలు





**కడప, జూన్ 15 ప్రభాతవార్త :**
కేఎస్‌ఆర్ఎం కళాశాలలో ఈరోజు ముందస్తు బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్ మూర్తి మాట్లాడుతూ బక్రీద్ ముస్లిం సోదరులకు ఎంతో విశిష్టమైన పండుగ అని, రంజాన్ తర్వాత ఇది అతిపెద్ద పండుగ అని అల్లా ఆదేశానుసారం ఇబ్రహీం ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధం అవుతాడని ఆ సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లిం సోదరులు ఈ బక్రీద్ పండుగ భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా బక్రీద్ కేకు కోశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి, వైస్ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎస్‌మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ తదితర విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పీలేరులో ప్రయివేటు సీబీఎస్ఈ పాఠశాలు ఉన్నాయా...?

## సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు చేస్తున్న తపస్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమత తేజ

**పీలేరు, జూన్ 15 ప్రభాతవార్తః**
మండలంలో నిబంధనలకు విరుద్ధంగా సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు చేస్తున్న తపస్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి ఎంఈఓ గారికి ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమతతేజ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తేజ మాట్లాడుతూ సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఇ) గుర్తింపు లేకపోయిన తపస్య సీబీఎస్ఈ స్కూల్ పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌యుఐ దష్టికి వచ్చిందన్నారు. సీబీఎస్ఈ అఫిలియేషన్‌కు సంబంధించిన తప్పుడు వాదనతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి విపరీతమైన ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈతప్పుడు సమాచారం తల్లిదండ్రులను మోసం చేయడమే కాకుండా ఈసంస్థలో చేరిన విద్యార్థుల విద్యా భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తుందని వాపోయారు. కావున తపస్య స్కూల్‌పై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలిన సీబీఎస్ఈ అఫిలియేషనన్‌కు సంబంధించిన తప్పుడు వాదనతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి విపరీతమైన ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యా నియమాలు , నిబంధనలను ఉల్లంఘించినందుకు పాఠశాల నిర్వహణపై అవసరమైన చట్టపరమైన పరిపాలనా చర్యలు తీసుకోవాలని అలాగే బాధిత తల్లిదండ్రులకు తప్పుడు నెపంతో వసూలు చేసిన ఫీజు రీఫండ్ చేయించాలని డిమాండు చేశారు. లేని పక్షంలో ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని



హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి సంపత్‌కుమార్, ఇమ్రాన్, అఖిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

**గాలివీడు, జూన్ 15(ప్రభాతవార్త):**

తలముడిపి, కొర్లకుంట, పందికుంట గ్రామాల విద్యార్థులు నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకోవడానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ శనివారం జిల్లా కలెక్టర్ అభిషిక్తకిషోర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నూలివీడు కొండ్రెడ్డిగారిపల్లెలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి సుదూర ప్రాంతాలైన తలముడిపి, పందికుంట, కొర్లకుంట గ్రామాల మధ్య 14 కిలోమీటర్ల దూరం ఉంది. ఆయా గ్రామాల నుండి 30 మంది వరకు విద్యార్థులు నూలివీడుకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు. అయితే వీరు వెళ్లే మార్గంలో పాఠశాల వేళకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, ద్విచక్రవాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా తరచూ విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల డిపో బస్సు ఉదయం 8 గంటలకు సాయంకాలం 5 గంటలకు పాఠశాల వద్దకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లేదా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ట్రెజరర్ నాగార్జునగుప్త, సభ్యులు పాల్గొన్నారు.



# కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తుంది

**వేంపల్లె, జూన్ 15, ప్రభాతవార్త :**

కష్టపడిన ప్రతి కార్యకర్తను టీడీపీ గుర్తిస్తుందని వేంపల్లె మండల టీడీపీ పరిశీలకుడు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని టీడీ పీ కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలతో మండల కన్వీనరు మునిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సమన్వయం పాటించాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి పార్టీ న్యాయం చేకూరుస్తుం దన్నారు. ప్రతిఒక్కరి కష్టంతోనే టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలు పొందిందన్నారు. ప్రతి ఒక్కరు మండల అభివృద్ధికి తోడ్పడాలని తె లిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు షబ్బీర్, సీనియర్ నాయకులు డాక్టర్ సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి, రమేష్, టీడీపీ నాయకులు శేషారెడ్డి, డాక్టర్ కరిముల్లా, భాస్కర్, పి.వి.రమణ, భద్ర, మల్లికార్జున, నాగభూషణం, కిషోర్, షమీ వుల్లా, మస్తాన్, తెలంగాణ వలి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



# దేశ నిర్మాణంలో ఇంజనీర్లు ఎంతో కీలకం






**రాజంపేట అర్బన్, జూన్ 16, ప్రభాతవార్త:**

దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని అనంతపురం జేఎన్టీయూ వైస్ ఛాన్స్‌లర్ జీవిఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ రంగంలో ప్రపంచంలో అద్భుతమైన ప్రతిభ పాటవాలు ప్రదర్శించి సాంకేతికంగా నూతన ఆవిష్కరణలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో 2024విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన బిటెక్ విద్యార్థులకు పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జె.ఎన్.టి.యూ అనంతరపురం యూనివర్సిటి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జీవిఆర్ శ్రీనివాసరావు, పులివెందుల జేఎన్‌టి యూనివర్సిటి నామినీ డాక్టర్ జి.వెంకట నగేష్‌కుమార్ విచ్చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకున్న తర్వాత తాము ఎంచుకున్న కోర్సుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. సాంకేతికంగా, ప్రాక్టికల్‌గా కోర్సులో పట్టు సాధించినప్పుడే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల సాధించిన విజయాలు పట్ల హర్శం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించడం ఎంతో గొప్ప విశయమని అన్నారు. అంతేకాకుండా అన్నమాచార్య కళాశాల అత్యుత్తమ విద్యా ప్రయోగాలు నెలకొల్పి విద్యార్థులను నిర్దేశిత లక్ష్య సాధనలో మేటిగా నిలుస్తుందని కొనిఆడారు. అనంతరం 930మంది విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సామాజిక అంశాలపై స్పష్టమైన అవగాహణ ఉండాలన్నారు. అంతేకాకుండా విద్యార్థులందరూ ఎప్పటికప్పుడు జ్ఞానాన్ని పంచుకోవడంలో ముందుండాలని, అప్పుడే మరిన్ని కొత్త విశయాలె తెలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏపీజే అబ్దుల్ కలామ్, సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలిపిన సూక్తులను గుర్తు చేశారు. అనంతరం కళాశాల చైర్మెన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్‌చైర్మెన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణలు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో విలువలు, వైఖరిని బట్టి భవిష్యత్తు నిర్ణయించబడుతుందని అన్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో అపజయాలు ఎదురైనప్పుడు ధైర్యం కోల్పోకుండా ముందుకు నడవాలని సూచించారు. అన్నమాచార్య విద్యాసంస్థలు అందిస్తున్న సదుపాయాలను వివరించారు. విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, సమాజంపట్ల బాధ్యత, అంకితభావం కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు తాము అభ్యసించిన విద్యను దేశాభివృద్ధికి అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.మారుతీ ప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టిఎన్ రంగనాథమ్, డీఎన్స్ డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు, డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ డి.కృష్ణమోహన్ రాజు, డాక్టర్ ఎన్.శివరామిరెడ్డి, వివిధ రంగాల విభాగాధిపతులు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధ్యతగా ప్రభుత్వ విధులు నిర్వహించండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జూన్ 15 ప్రభాతవార్త :**

ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలోని సిఎల్ఆర్‌సి భవనంలో అన్ని శాఖల ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రధానంగా ప్రజలకు మౌళిక వసతులైన రోడ్లు, నీటి ఎద్దడి నివారణ, వీధి దీపాలు, పారిశుధ్య నివారణ లాంటి పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. ప్రజల సౌకర్యార్థంగా పనిచేయాలన్నారు. ప్రతి శాఖవారీగా ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ అనూరాధ, ఎంపిడిఓ భానుప్రకాష్, ఏపిడి శివ శంకర్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్, వ్యవసాయ, ఇరిగేషన్‌శాఖకు చెందిన ఉద్యోగులు, పోలీసులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# ఘనంగా ద్రౌపదీదేవి కళ్యాణం

**పీలేరు, జూన్ 15 ప్రభాతవార్త:**



ద్రౌపదీదేవి కళ్యాణం నిర్వహిస్తున్న దశ్యం

స్థానిక ఆర్టీసీ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం ద్రౌపదీ కళ్యాణంను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ద్రౌపదీ కళ్యాణానికి పూర్వీకుల నుంచి ఒక విశిష్టప్రాధాన్యత ఉంది. కళ్యాణం తిలకించిన కుటుంబాలకు భగవంతుడు అష్టైశ్వర్యాలు ఇస్తారని పురాణాలు చెబుతున్నాయి. అందువల్ల ద్రౌపదీ కళ్యాణం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దంపతులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. ధర్మానికి, అధర్మానికి ఉన్న సారాంశాన్ని వివరించే భారతంలో ద్రౌపదీదేవి కళ్యాణఘట్టం ప్రథమంగా ఉంది. కళ్యాణఘట్టం తరువాత కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు ద్రౌపదీదేవి ప్రతిమ వద్ద కొబ్బరికాయలు సమర్పించుకున్నారు. కళ్యాణ ఘట్టాన్ని భాగవతారిని రెడ్డి కుమారి కళ్ళకు కట్టినట్టు వివరించడంతో భక్తాదులు ఆసక్తిగా తిలకించారు. కళ్యాణఘట్టం ముగిసిన తరువాత దంపుతులు ద్రౌపదీదేవి శిరస్సుపై అక్షింతలు సంప్రోక్షణ చేశారు.

# ప్రతి విద్యార్థి పాఠశాలలో చదువుకోవాలి




**లక్కిరెడ్డిపల్లె, జూన్ 15,ప్రభాతవార్త:**

ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలి లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జీ మండల లీగల్ అథారిటి చైర్మెన్ షేక్ ఫైజున్నీసా పేర్కొన్నారు.శనివారం లక్కిరెడ్డిపల్లెలోని జడ్జీ బాలుర పాఠశాలను ఆమే సందర్శించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.అన్నం బాగా ఉడికించి పెట్టాలని ప్రభుత్వ మెను ప్రకారం విద్యార్థులకు బోజనం అందించాలన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆమే విద్యార్థులకు తెలియజేశారు.లక్కిరెడ్డిపల్లె జడ్జీ పాఠశాలలో చదివిన విద్యార్థులు కలెక్టర్లు,ఎస్సీలు ఉన్న విబరాలు ఆద నిరోహరిస్తారని ఆమే విద్యార్థులకు తెలిపారు.ప్రతి విద్యార్థి భాగా కష్టపడి చదవి మంచి పలితాలు సాదించి ఉన్నత శిఖరాలు అదురోహించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబందించిన విద్యా సామాగ్రి అందించిరని ప్రతి విద్యార్థా కష్టపడి చదవి మంచి ఫలితాలు సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ప్రదానోపాధ్యుడు వెంకటేశ్వరులు, ఉపాధ్యాయుల కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకల్లో గోవులకు హాని తలపెట్టవద్దు

**రాజంపేట అర్బన్, జూన్ 15, ప్రభాతవార్త:**



బక్రీద్ పండుగ సంధర్భంగా గోవధకు దూరంగా ఉండాలని రాజంపేట ఆర్డిఓ మోహన్ రావు కోరారు. శనివారం తన ఛాంబర్‌లో బక్రీద్ పండుగ నేపధ్యంలో శాంతి కమిటి నేతలతో సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ సంధర్భంగా గోవు(ఆవు) లకు హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశమునకు రాజంపేట ముస్లిం పెద్దలు, పోలీసు అధికారులు హాజరు కావడం జరిగింది. అదేవిధంగా రాజంపేట మండలంలోని ఎల్లాగడ్డ, కోడూరు ముస్లిం పెద్దలకు ఈ విశయం తెలియజేయాలని అధికారులకు సూచించారు.

# ఘనంగా శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**ఖాజీపేట, జూన్ 15, ప్రభాతవార్త:**



శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన ఖాజీపేట సమీపంలోని కోటంగురాయపల్లె గ్రామంలో శ్రీ లక్ష్మి పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు సప్తమ వార్శిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూలవిరాట్ కళ్యాణ వెంకటేశ్వర స్వామి విశేషమైన అలంకారం, ఉదయం కార్యక్రమాలు, సుప్రభాత సేవ తోమాల సేవ విశ్వక్షనారాధన నిత్యార్చన ధూప దీప మహా నైవేద్యం మహామంగళహారతి భక్తులకు దర్శనం ఇచ్చారు. తదుపరి ఉదయం 10గంటలకు లక్ష్మి పద్మావతి సమేత కళ్యాణం వెంకటేశ్వర స్వామి వారి అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శివ గాయత్రి స్వామి ఆధ్వర్యంలో సురేంద్ర శర్మ తదితరులు పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సురేష్ బాబు, ఆలయ కమిటి సభ్యులు, గ్రామానికి చెందిన నారుపల్లె సూర్యనారాయణ రెడ్డి, ధర్మపత్ని శివలీల, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో

# భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం

**ఖాజీపేట, జూన్ 15, ప్రభాతవార్త:**



ఖాజీపేట మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందని తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు చంద్ర భాస్కర్ రెడ్డి ఆరోపించారు. శనివారం నాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వైసిపి నాయకులకు, వారి అనుచరులకు ఉపాధి హామీ పనికి వెళ్లకుండా వారు పని చేసినట్లు వారి అకౌంట్‌లో డబ్బులు వేశారన్నారు. ఖాజీపేట ఫీల్డ్ అసిస్టెంట్ ఓబయ్య అలియాస్ ఓబుసేసు వారి కుటుంబ సభ్యులకు ఉపాధి హామీ పనికి వెల్లకుండానే వెల్లినట్లుగా అకౌంట్‌లో డబ్బులు వేసుకున్నారని తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఒక కుటుంబానికి వంద రోజులు పని కల్పించాల్సి ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్ తన కుటుంబానికి ఒక్కొక్కరికి వంద రోజులు చొప్పున 300రోజులు పని కల్పించి ప్రభుత్వ సొమ్మును బారీగా అవినీతికి పాల్పడ్డాడని, ఫీల్డ్ అసిస్టెంట్ భార్య ఏపీ మోడల్ స్కూల్‌లో ఒక ఉద్యోగి అని ఆమె పనికి వెల్లకుండా అక్రమ సొమ్మును తన అకౌంట్‌లో వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ తన కూతురు, కొడుకు, భార్య పేరిట పాల్పడిన అవినీతి సొమ్మును ప్రభుత్వం వారు తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఖాజీపేట మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు భారీ ఎత్తున చోటుచేసుకున్నాయని ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో లక్షలాది రూపాయలు అవినీతి జరిగిందని ఉన్నతాధికారులు స్పందించి అక్రమ సొమ్మును రికవరి చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రజలకు న్యాయ సహాయాన్ని అందించేందుకే

# న్యాయ విజ్ఞాణ సదస్సు



**ముద్దనూరు, జూన్ 15, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎస్.భార్గవి శనివారం ముద్దనూరు మండల పరిధిలో కె.కొత్తపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాణ సదస్సు నిర్వహించారు. చట్టాలపై అవగాహణ కల్పించడానికి నేరుగా ప్రజల వద్దకు వచ్చామని, చట్టాల గురించి తెలియకపోవడం వల్లే ప్రజలు నేరాలకు పాల్పడుతున్నారని, భూములు క్రయ విక్రయాలు లావా దేవీలలో మోసాలకు గురవుతున్నారని తెలిపారు. గ్రామాలలో ఏదైనా చిన్న చిన్న సమస్యలను పెద్దల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు వర్గాల మధ్య నెలకొన్న వివరాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలంటే అధిక సమయం ఖర్చుతో కూడుకున్న పని అని సామాన్యులకు భారంగా ఉంటుందన్నారు. అందుకే న్యాయ విజ్ఞాణ సదస్సును నిర్వహించామన్నారు. అదేవిధంగా ఈనెల 29వ తేది జాతీయ లోక్ అదాలత్ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఈ సమస్య పరిష్కారం సుప్రింకోర్టు తీర్పుతో సమానం అన్నారు. అదేవిధంగా సీఐ దస్తగిరి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోన్ యాప్‌ల ద్వారా చాలా మంది మోసపోతున్నారని వారి జోలికి వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణమ్మ, ఎండీఓ చంద్రమౌళి, డిటి సౌజన్య, సీనియర్ న్యాయవాది సుబ్బారెడ్డి, ముని సుబ్బారెడ్డి, నాగార్జున రెడ్డి, భాస్కర్ బాబు, ఏఎస్ఐ శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ రమేష్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

**బద్వేలు, జూన్ 15 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధిలో వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహ స్వామి దేవస్థానంలో జేష్టమాసం ఆరంభం రెండవ శనివారం సందర్భంగా లక్ష్మినరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.లక్ష్మినరసింహ స్వామివారికి, అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించడం వలన దోషాలు తొలగి శుభం జరుగుతుందని భావనతో భక్తులు జ్యేష్టమాసం రెండవ శని వారం పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. భక్తి,శ్రద్దలతో లక్ష్మి నరసింహస్వామిని వేడుకోవడం వలన వివాహం కానివారికి, సంతానం లేనివారికి మంచి ఫలితం అందుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం మండలం, గొల్లపల్లె గ్రామానికి చెందిన ఉంచే చంద్రశేఖర్, సతీమణి మల్లేశ్వరి, కుమారుడు ఉమేష్ చంద్ర పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరితోపాటు పలవురు ప్రముఖులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



